ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 జనగామ
శుక్రవారం 18 అక్టోబరు 2024

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



తొర్రూరులో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పాలకుర్తి, అక్టోబరు 17 : రైతు సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. గురువారం మల్లంపల్లి, తొర్రూరు, అయ్యంగారిపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల వద్ద దొడ్డు, సన్నరకం వడ్లను వేర్వేరుగా కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. మార్కెట్ ధరతో పాటు రూ.500 బోనస్ అందచేస్తామని తెలిపారు. ధాన్యాన్ని కేంద్రాల్లో అమ్మిన రెండు, మూడు రోజుల్లో రైతుల అకౌంట్లల్లో డబ్బులు జమ అయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

● ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి బస్‌స్టాండ్‌ను పరిశీలించారు. ప్రయాణికుల సౌకర్యార్థం బస్‌స్టాండ్‌లో అనేక సమస్యలు ఉన్నాయని వాటి పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. మహిళలకు మరుగుదొడ్లు, మూత్రశాలలు వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. జనగామ, తొర్రూరు, వరంగల్ డిపోల నుంచి బస్సులు బస్‌స్టాండ్‌లోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరక మేరకు ఏర్పాట్లు చేస్తామన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ రాపాక సత్యనారాయణ, మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, చిలువేరు కృష్ణమూర్తి, ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ అశోక్‌రెడ్డి, షైసిరెడ్డి, మాజీ సర్పంచు అనుముల మల్లారెడ్డి, కార్తిక్ రెడ్డి, మధుకర్‌రెడ్డి, బీరు సోమేశ్వర్, కొంరోజు సోమన్నఉన్నారు.

క్రైం కార్నర్

కుటుంబ కలహాలతో ఆత్మహత్య



ఉప్పునూతుల దర్గయ్య (ఫైల్)

జఫర్‌గడ్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం షాపల్లిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ రాంచరణ్ నాయక్ తెలిపిన ప్రకారం ఉప్పునూతుల దర్గయ్య (45) వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. బ్యాంకు నుంచి తీసుకువచ్చిన లోను డబ్బులను దర్గయ్య తాగుడుకు ఖర్చు చేస్తుండడంతో ఇదేమని భార్య ప్రశ్నించడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. మనస్థాపం చెందిన ఆయన ఈనెల 16న ఉదయం ఇంట్లో నుంచి వెళ్లి గ్రామ చివర గల సొంత వ్యవసాయ పొలం వద్ద పురుగుల మందు తాగాడు. చుట్టుపక్కల వారు గమనించి కుటుంబీకులకు సమాచారం ఇవ్వడంతో వరంగల్‌లోని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం చనిపోయాడు. దర్గయ్యకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

పత్తి కొనుగోళ్లకు సై



- నేటి నుంచి కొనుగోళ్లకు శ్రీకారం
- జిల్లాలో 10 జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ కేంద్రాలు
- తేమ శాతం ఆధారంగా ధర
- గతేడాదికంటే రూ.500 పెరిగిన ధర
- ఆధార్ ద్వారా కొనుగోళ్లు
- వాట్సాప్ చాట్ ఆధారిత సేవలు అమలు

జనగామ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): వానాకాలం సీజన్‌కు సంబంధించి పత్తి కొనుగోళ్లకు జిల్లా యంత్రాంగం సిద్ధమైంది. జిల్లాలో పత్తి తీత సీజన్ ఆరంభం కావడంతో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) ఆధ్వ ర్యంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. సీసీఐ కేంద్రాల ఏర్పా టు చేయడం ద్వారా పత్తి రైతులకు కనీస మద్దతు అందించాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకోసం జిల్లాలో ప్రస్తుతం 10సీసీఐ కేంద్రాల ను తెరవాలని నిర్ణయించారు. మొదట్లో 15 కేంద్రా లను ఏర్పాటు చేయాలని భావించగా సీసీఐ నుం చి 10కేంద్రాలకు మాత్రమే అనుమతి రావడంతో వాటినే ఏర్పాటు చేస్తున్నారు. ఈ కేంద్రాలను గుర్తించిన 10 జిన్నింగ్ మిల్లుల్లో ఏర్పాటు చేయ నున్నారు. శుక్రవారం నుంచి సీసీఐ కేంద్రాలను తెరిచి పత్తి కొనుగోళ్లకు శ్రీకారం చుట్టనున్నారు.

తేమ శాతం ఆధారంగా ధర

సీసీఐ కేంద్రాలకు రైతు తెచ్చిన పత్తిలోని తేమ శాతం ఆధారంగా ధర అందనుంది. సీసీఐ నిబంధనల ప్రకారం పత్తిలో తమ 8శాతానికి మించకూడదు. 8 శాతానికి లోపు తేమ ఉంటే క్వింటాకు రూ.7,521 ధర రానుంది. తేమ శాతం పెరిగిన కొద్దీ ఒక శాతానికి క్వింటా కు రూ.75.21 చొప్పున ధర తగ్గనుంది. ఈ లెక్కన తేమ శాతం 9ఉంటే రూ.7,445, తేమ శాతం 10 ఉంటే రూ.7,370, తేమ శాతం 11ఉంటే రూ.7,295, తేమ శాతం 12 ఉంటే రూ.7,220 చొప్పున రైతులకు ధర కల్పించనున్నారు. కేంద్ర ప్రభుత్వం 2024-25 సంవత్సరానికి గానూ కనీస మద్దతు ధరలను ఇటీవల సవరించింది. ఇందులో భాగంగా గత ఏడాది పత్తి ధర క్వింటాలుకు మధ్యరకం రూ.6,620, పొడవు రకం రూ. 7,020 ఉండగా ఈ ఏడాదికి గానూ మధ్యరకం రూ.7,121, పొడవు రకం రూ.7,521కి పెంచింది. గత ఏడాది కంటే క్వింటాకు మద్దతు రూ.501పెరిగింది. దీంతో రైతులు సీసీఐ కేంద్రాల్లోనే పత్తిని అమ్ముకొని కనీస మద్దతు ధర పొందాలని అధికారులు సూచిస్తున్నారు. కనీస

» మిగతా 8వ పేజీలో...

నేటి నుంచి పత్తి కొనుగోళ్లు ప్రారంభం: కలెక్టర్



పత్తి కొనుగోళ్లపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్

జనగామ రూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): నేటి నుంచి జిల్లా వ్యాప్తంగా పత్తి కొనుగోళ్లు ప్రారంభిస్తున్నామని కలెక్టర్ షేక్ రిజ్వార్ బాషా తెలిపారు. కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో గురువారం పత్తి కొనుగోలుపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం సీసీఐ ద్వారా మద్దతు ధర పత్తిని కొనుగోలు చేయడం జరుగుతుందని, తేమశాతం 8 ఉండేలా చూసుకోవాలని రైతులకు సూచించారు. 88972 81111 నంబరును మొబైల్‌లో సేవ్ చేసుకొని హాయ్ అని టైప్ చేస్తే పత్తి అమ్మకం, ఇతర వివరాలు చేసుకోవచ్చన్నారు. సీసీఐకి రైతులు పత్తి అమ్ముకోవాలంటే తప్పనిసారిగా ఆధార్ అనుసంధానంతో బ్యాంకు ఖాతాలో డబ్బులు జమ చేయడం జరుగుతుందన్నారు. తూనికలు, కొలతల శాఖ అధికారులు జిన్నింగ్ మిల్లులను తనిఖీ చేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్, మార్కెటింగ్ అధికారి నరేందర్, ఏఈవో రామారావు నాయక్, ఎస్ఈ వేణుమాధవ్ పాల్గొన్నారు.

ధరణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి: కలెక్టర్

జనగామ రూరల్, అక్టోబరు 17(ఆంధ్యజ్యోతి) ప్రజావాణిలో దరఖాస్తు చేసుకున్న ధరణి సమస్యలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో గురువారం కలెక్టర్ అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్‌తో కలిసి రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మీసేవా ద్వారా వచ్చిన దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా నిర్దేశిత సమయంలో సమస్యలను పరిష్కరించాలన్నారు. తహసీల్దార్లు రేషన్‌షాపులను ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలని, ప్రతీ రేషన్ షాపులో సూచిక బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో ఆర్డీవో కొమురయ్య సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కేయూకు రెగ్యులర్ వీసీ?

నేడో, రేపో ఉత్తర్వుల జారీకి అవకాశం

నియామకంపై కొనసాగుతున్న ఉత్కంఠ



7

ఆటంకం

- నిరుపయోగంగా క్రీడా ప్రాంగణాలు
- పిచ్చిమొక్కలతో నిండిన మైదానాలు
- పట్టించుకోని పాలకులు
- లక్షల రూపాయల ప్రజా ధనం వృథా

8

సమస్యలను పరిష్కరించాలి



- విద్యార్హతల ఆధారంగా ఆర్టిజన్స్‌ను కన్వర్షన్ చేయాలి
- టీవీఏసీ జాక్ డిమాండ్
- లేదంటే జాక్ ఆధ్వర్యంలో సమ్మె
- మహాధర్నాతో దద్దరిల్లిన సీఎండీ కార్యాలయం

6

విద్యుత్ భవన్ ఎదుట ధర్నా చేస్తున్న ఆర్టిజన్ కార్మికులు

ధాన్యం దళారుల పాలు

నర్మెట, అక్టోబరు 17: ధాన్యాన్ని దళారులకు విక్రయించొద్దని ఓ వైపు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తే, కొందరు రైతులు అవగాహనలేక దళారుల ధాన్యం విక్రయించి నష్టపోతున్నారు. కొనుగోలు కేంద్రానికి వచ్చే ధాన్యాన్ని దళారులు కొనుగోలు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. గురువారం కన్నెబోయినగూడెంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించగా పక్కనే దళారులు ధాన్యం కొనుగోలు చేసి లారీలో లోడ్ చేయడం విస్మయం కలిగించింది. ఇంత జరిగినా అధికారులు, ప్రజాప్రతినిధులు, మార్కెట్ డైరెక్టర్లు, పట్టించుకోకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

ధాన్యాన్ని దళారులకు విక్రయించొద్దు

రైతులు తమ ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దని పీఏసీఎస్ చైర్మన్ కేశిరెడ్డి ఉపేందర్‌రెడ్డి సూచించారు. గురువారం మండలకేంద్రంతోపాటు కన్నెబోయినగూడెం గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈవో కొన్నె వెంకటయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజబోయిన లక్ష్మీనారాయణ, కొమురవెల్లి దేవస్థాన మాజీ చైర్మన్ గొల్లపల్లి కుమారస్వామి, కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు చెవుల పరుశరాములు, బైరోని ఆంజనేయులు, మార్కెట్ డైరక్టర్లు ఏసళ్ల అంజయ్య, లక్ష్మి పాల్గొన్నారు.



కన్నెబోయినగూడెంలో కొనుగోలు కేంద్రం వద్దే లారీలో ధాన్యం లోడ్ చేస్తున్న దళారులు

సురేఖ.. నాకు స్ఫూర్తి!

- ట్విటర్ ఎక్స్‌లో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి పోస్ట్
- ఎమ్మెల్యేల అసమ్మతి వేళ మంత్రిపై ప్రశంసలు



ఎక్స్‌లో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి పెట్టిన ఫొటో

వరంగల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తనకు రాష్ట్ర అటవీ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ స్ఫూర్తి అని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి ట్విటర్ ఎక్స్ వేదికగా ప్రశంసలు కురిపించారు. సినీహీరో అక్కినేని నాగార్జున కుటుంబంపై చేసిన వ్యాఖ్యలు, గీసుగొండ పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌హెచ్‌వో సీట్లో కూర్చోవడం లాంటి వరుస వివాదాలతో పాటు సొంత జిల్లాకు చెందిన సొంత పార్టీ నేతలనుంచి అసంతృప్తి సెగ ఎదుర్కొంటున్న సురేఖ ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయాల్లో ఒంటరి అవుతున్నారన్న చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి ట్విటర్ ఎక్స్ వేదికగా చేసిన పోస్టు ఓరుగల్లు రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది. సురేఖపై ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యేల్లో యశస్వినిరెడ్డి కూడా ఉందనే ప్రచారం జరిగింది. కానీ బుధవారం రాత్రి మడికొండలో జరిగిన ఓ ప్రైవేట్ కార్యక్రమంలో కలుసుకున్న మంత్రి సురేఖ, యశస్వినీరెడ్డి ఫొటోలు దిగి, సరదాగా గడిపారు. ఆ తర్వాత ఆ ఫొటోలను యశస్వినిరెడ్డి ట్విటర్ ఎక్స్‌లో పోస్టు చేస్తూ.. 'హనుమకొండలో జరిగిన ఓ ప్రైవేట్ కార్యక్రమంలో మంత్రి సురేఖను కలిశా. ఆమె ప్రజల కోసం స్థిరంగా నిలబడతారు. ప్రగతి కోసం అవిశ్రాంతంగా పని చేస్తారని నిరూపించుకున్న డైనమిక్ లీడర్. ప్రజాసేవలో ఆమె చూపే నిబద్ధత నాకు స్ఫూర్తినిస్తుంది' అంటూ ప్రశంసల్లో ముంచెత్తారు. అయితే మంత్రిపై ఎమ్మెల్యేలు ఫిర్యాదు చేసిన 24గంటల్లోపే పాలకుర్తి ఎమ్మెల్యే ఎక్స్ వేదికగా చేసిన పోస్టు రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. సొంత పార్టీ నేతల నుంచి దూరమవుతున్నారని అనుకుంటున్న కొండా ఎపిసోడ్‌లో ఇదో కీలక మలుపన్న అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

పశువులకు గాలికుంటు టీకాలు వేయించాలి

- జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రాధాకిషన్

జఫర్‌గడ్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) : గాలికుంటు వ్యాధి నివారణకు పశువులకు టీకాలు వేయించాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వై.రాధాకిషన్ రైతులు, పెంపకందారులకు సూచించారు. జిల్లా పశువైద్య శాఖ ఆధ్వర్యంలో ఈనెల 15 నుంచి పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం చేపట్టింది. ఈ నేపథ్యంలో జఫర్‌గడ్‌లో గురువారం నిర్వహించిన శిబిరాన్ని సందర్శించి రాధాకిషన్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో పశువైద్యులతోపాటు సిబ్బంది ప్రతి పశువుకు టీకా వేయాలని, వచ్చేనెల 14 వరకు కార్యక్రమాన్ని ఉంటుందన్నారు. కార్యక్రమంలో పశువైద్య సహాయ సంచాలకులు డాక్టర్ సారంగపాణి, మండల పశువైద్యాధికారి సీహెచ్. రజిత, వెటర్నరీ అసిస్టెంట్ మంజుల, గోపాలమిత్రలు రాజు, సీహెచ్.గణేష్ పాల్గొన్నారు.



జఫర్‌గడ్‌లో పశువులకు టీకాలు వేస్తున్న రాధాకిషన్

ఇందిరమ్మ కమిటీలో స్థానం కల్పించడం లేదని నిరసన



జఫర్‌గడ్‌లో నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నేతలు

స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): అధికారంలో లేకున్నా ఏళ్ల నుంచి పార్టీ కోసం పని చేస్తున్న వారికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి న్యాయం చేయాలని లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని మహిళ కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి నారగోని పద్మ హెచ్చరించారు. ఇందిరమ్మ కమిటీలు, నామినేటెడ్ పదవుల్లో పాత కాంగ్రెస్ నాయకులకు తగు న్యాయం చేయాలని కోరుతూ డివిజన్ కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట మహిళ కాంగ్రెస్ నాయకులు గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 15ఏళ్లుగా కార్యకర్తలం పార్టీ కోసం పనిచేస్తున్నామన్నారు. పార్టీని నమ్ముకొని ఉన్న వారికి న్యాయం జరుగుతుందనుకున్న తరుణంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఆయన అనుచరులు పార్టీలో చేరడంతో తమకు అవకాశాలు రావడం లేదన్నారు. ఇటీవల ప్రకటించిన మార్కెట్ కమిటీలో కడియం వర్గీయులకే పదవులు వచ్చాయని ఆరోపించారు. కనీసం పార్టీ సభ్యత్వం లేనివారికి పదవులు వచ్చాయే తప్ప, తమని పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇందిరమ్మ కమిటీలో పాత కాంగ్రెస్ నాయకులకు అవకాశాలు కల్పించాలని లేదంటే ఆందోళనలు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు నారగోని సరిత, రాణి, కనకలక్ష్మి, లావణ్య, ఎల్లమ్మ, ఉపేంద్ర పాల్గొన్నారు.

● జఫర్‌గడ్ : ఇందిరమ్మ కమిటీల ఏర్పాటుపై కాంగ్రెస్ శ్రేణుల నిరసనల వెల్లువ కొనసాగుతోంది. గురువారం జఫర్‌గడ్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద మాజీ జడ్పీటీసీ పట్టపురి సదయ్యగౌడ్ నేతృత్వంలో శ్రేణులు నిరసన చేపట్టాయి. ఆయన మాట్లాడుతూ పేదలకు ఇళ్ల మంజూరు కోసం ఏర్పాటు చేసే ఇందిరమ్మ కమిటీల్లో మొదటి నుంచి కాంగ్రెస్‌లో ఉండి కష్టపడి పని చేస్తున్న నాయకులు, కార్యకర్తలను నియమించకుండా.. ఇటీవల పార్టీలోకి వచ్చిన వారిని నియమించడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రడపాక రాజ్‌కుమార్, తాటికాయల శరత్‌బాబు, లచ్చిరాంనాయక్, నంచర్ల యాదగిరి, కైరిక మల్లయ్య ఓరుగంటి రాజు, లక్ష్మీనర్సయ్య పాల్గొన్నారు.

ఎస్ఏ వన్ పరీక్షలకు సిద్ధం

ఈనెల 21 నుంచి అన్ని పాఠశాలల్లో ప్రారంభం

1 నుంచి 10 తరగతుల విద్యార్థులకు నిర్వహణ

విద్యార్థులను సిద్ధం చేస్తున్న ఉపాధ్యాయులు



స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, అక్టోబరు 17: ఈనెల 21 నుంచి 28 వరకు అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో సమ్మేటివ్ అసెస్‌మెంట్(ఎస్ఏ) 1 పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ప్రభుత్వం పరీక్షల షెడ్యూల్ విడుదల చేసింది. 1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఈ పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్షలకు సంబంధించిన ప్రశ్న పత్రాలు కూడా డీఈవో ఆధ్వర్యంలో మండల రిసోర్స్ సెంటర్లకు చేరవేశారు. వాటిని పాఠశాలలకు చేరవేయడానికి సీఆర్‌పీలు ఏర్పాట్లు చేశారు. వాటిని శుక్రవారం నుంచి హెచ్ఎంలకు పంపిణీ చేస్తారు. ప్రభుత్వం విడుదల చేసిన ఒకే షెడ్యూల్ ప్రకారం ఎస్ఏ1 పరీక్షలు నిర్వహించడానికి జనగామ జిల్లాతో పాటు వరంగల్, ములుగు, భూపాలపల్లి, హన్మకొండ, మహబూబాబాద్ జిల్లాలో కూడా ఏర్పాట్లు చేశారు.

పరీక్షల షెడ్యూల్..

- 1 నుంచి 5 తరగతులకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు
- 6, 8, 10 తరగతులకు ఉదయం 9.15 నుంచి 12 గంటల వరకు
- 7, 9 తరగతులకు మధ్యాహ్నం 1.15 నుంచి 4 గంటల వరకు
- 9వ తరగతికి మధ్యాహ్నం 1.15 నుంచి 4.15 గంటల వరకు

గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడులు

- 610 కిలోల బెల్లం, 338 లీటర్ల గుడుంబా స్వాధీనం
- 33 మందిపై కేసు నమోదు
- ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్



బెల్లం పానకాన్ని పారబోస్తున్న పోలీసులు

మహబూబాబాద్ రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాలు, గ్రామాల్లో, మారుమూల ప్రాంతాల్లో గురువారం తెల్లవారుజాము నుంచే గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించి, గుడుంబా విక్రయిస్తున్న వారి పై కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ తెలిపారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారు సాలార్‌తండలో టౌన్ సీఐ గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. జిల్లా 5,840 లీటర్ల బెల్లంపానకం ధ్వంసం చేసి 641 కిలోల నల్లబెల్లం, 338 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఇందుకు బాధ్యులైన 33 మందిపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. ఎవరైనా అక్రమంగా గుడుంబా తయారు చేసినా, విక్రయించిన వారిపై బైండోవర్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గ్రామస్థులకు గుడుంబా వల్ల జరిగే నష్టంపై అవగాహన కల్పించారు. నూతన చట్టాల గూర్చి, సైబర్‌నేరాలు, అన్‌లైన్, ఆర్థిక మోసాలు, బాల్యవివాహాలు, లైంగికదాడుల గూర్చి, కొత్తచట్టాల అమలు చేసే కఠిన శిక్షలపై అవగాహన కల్పించారు. ఈ దాడుల్లో డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, సుమారు 155 పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు జాబ్ మేళా

వరంగల్ ఎడ్యుకేషన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) : జిల్లా ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో ఈ నెల 19న జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఎంప్లాయిమెంట్ అధికారి ఎం. మల్లయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రెడిట్ యాక్సెస్ గ్రామీణ్ లిమిటెడ్ హైదరాబాద్‌కు చెందిన కంపెనీలో రాష్ట్రంలో ఎక్కడైనా పనిచేసేందుకు ట్రెయినీ కేంద్ర మేనేజర్ 50 ఖాళీలను భర్తీ చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అభ్యర్థులు 18 నుంచి 28 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఇంటర్, ఐటీఐ, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులైన వారు జాబ్ మేళాలో పాల్గొన వచ్చునని తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 19న ములుగు రోడ్ లోని జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో నిర్వహించే జాబ్ మేళాలకు ఉదయం 11 గంటలకు హాజరు కావాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు 789 33 94393 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

కేయూ డిగ్రీ మొదటి సెమిస్టర్ ఫీజు గడువు 28

కేయూ క్యాంపస్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ మొదటి ఏడాది మొదటి సెమిస్టర్ విద్యార్థులందరూ అక్టోబరు 28 వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఫీజులు చెల్లించుకోవాలని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎం. తిరుమలదేవిలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ. 50 అపరాధ రుసుంతో నవంబరు 2వ వరకు ఫీజు చెల్లింపునకు అవకాశం ఉందని పేర్కొన్నారు. బీఏ, బీకాం, బీఎస్సీతో పాటు ఇతర కోర్సుల రెగ్యు లర్, బ్లాక్ లాగ్ విద్యార్థులందరూ ఫీజులు చెల్లించుకోవాలని కోరారు. ఇతర వివరా లకు కళాశాలలో సంప్రదించాలని వివరించారు.

యువతి అదృశ్యం

డోర్నకల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : డోర్నకల్ మండలం హున్యాతండా గ్రామపంచాయతీకి చెందిన 19 ఏళ్ల యువతి అదృశ్యమైనట్లు డోర్నకల్ సీఐ రాజేష్ గురువారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం. సదరు యువతి ఈనెల 15న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాత్రిపొద్దుపోయేంత వరకు ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు ఆమె స్నేహితులు, బంధువుల ఇళ్లలో వాకబు చేశారు. ఎక్కడ ఆచూకీ లభించకపోవడంతో బుధవారం రాత్రి యువతి తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సీఐ తెలిపారు. యువతి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఇంజనీరింగ్ కళాశాల అభివృద్ధికి కృషి చేస్తా

ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు



కళాశాలలో సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్సీ రవీందర్‌రావు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఇంజనీరింగ్ కళాశాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు అన్నారు. మహబూబాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న ఇంజనీరింగ్ కళాశాలను గురువారం ఆయన సందర్శించారు. కళాశాలలో ప్రవేశాలు ఎలా ఉన్నాయి, తరగతుల నిర్వహణ, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు మొదలగు విషయాలను ప్రిన్సిపాల్ బలరాంనాయక్, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రవీందర్‌రావు మాట్లాడుతూ కళాశాల భవనానికి సంబంధించిన భూమి, నిర్మాణానికి నిధులు, ఫర్నీచర్ వంటి అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషిచేస్తానని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని సూచించారు. మునిసిపల్ వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, వార్డు కౌన్సిలర్ ఎడ్ల వేణుమాధవ్, మార్నేని రఘు, జెర్రిపోతుల వెంకన్న ఉన్నారు.

విద్యార్హతల ఆధారంగా

- టీవీఏసీ జాక్ డిమాండ్
- మహాధర్నాతో దద్దరిల్లిన సీఎండీ కార్యాలయం

ఆర్టిజన్ల కన్వర్షన్ చేయాలి



సీఎండీ కార్యాలయం వద్ద బైఠాయించి ధర్నా చేస్తున్న కార్మికులు

హనుమకొండ టౌన్, అక్టోబరు 17 : ఎన్పీడీసీఎల్‌లో ఆర్టిజన్స్‌కు ఉన్న విద్యార్హతల ఆధారంగా పోస్టింగ్ కేటాయించాలని తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ కన్వర్షన్ జాక్ (టీవీఏసీ) చైర్మన్ కె.ఈశ్వర్‌రావు డిమాండ్ చేశారు. ఆర్టిజన్స్‌ను కన్వర్షన్ చేసిన తర్వాతే డిస్కంలలో ఉద్యోగ నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ గురువారం హనుమకొండ నక్కలగుట్టలోని సీఎండీ కార్యాలయం ఎదుట టీవీఏసీ ఇచ్చిన పిలుపు మేరకు ఎన్పీడీసీఎల్‌ని 16 సర్కిళ్లలో ఆర్టిజన్ కార్మికులు పెద్ద ఎత్తున తరలివచ్చి మహాధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాక్ చైర్మన్ కె. ఈశ్వర్‌రావు మాట్లాడుతూ 2017లో 23,667 మంది కాంట్రాక్టు కార్మికులను ఆర్టిజన్స్‌గా గుర్తించగా, 2024 సంవత్సరం వచ్చే సరికి 23,667 మందిలో కొంత మంది రిటైర్డ్ కావడం, మరి కొంత మంది ప్రమాదాలతో మరణించడం ద్వారా ప్రస్తుతం 19,587 మంది ఆర్టిజన్‌లు మాత్రమే మిగిలిపోయారన్నారు. వారందరిని కన్వర్షన్ చేసి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టిజన్‌లల్లో ఐటీఐ చదివినవారికి జూనియర్ లైన్‌మెన్, డిప్లొమా పూర్తి చేసిన వారికి సబ్ ఇంజనీరింగ్, డిగ్రీ ఆపైన చదివిన వారికి జూనియర్ అసిస్టెంట్, పది చదవిన వారికి సబార్డినేట్‌గా, ఇంటర్ చదవినవారికి రికార్డ్ అసిస్టెంట్ ఉద్యోగం కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే దీనిపై ప్రజాభవన్‌లో డిప్యూటీ సీఎం, విద్యుత్‌శాఖ మంత్రి భట్టి విక్రమార్కను జాక్ ఆధ్వర్యంలో కలిసి చర్చించగా పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ సమస్య ఇలాగ ఉండగానే మరో 3500 పోస్టులను భర్తీ చేస్తామని ప్రభుత్వం ప్రకటన చేస్తుందని, ముందుగా 19,587 మంది ఆర్టిజన్‌లను కన్వర్షన్ చేసిన తర్వాతనే నియామకాలు చేపట్టాలని లేదంటే జాక్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెకు దిగుతామని మేనేజ్‌మెంట్, ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం జాక్‌లోని ముఖ్య నాయకులు సీఎండీ వరుణ్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. మహాధర్నాకు ముందు ఉమ్మడి ఐదు జిల్లాల నుంచి తరలివచ్చిన ఆర్టిజన్‌లు పబ్లిక్‌గార్డెన్ నుంచి ఎన్పీడీసీఎల్ కార్యాలయం వరకు ర్యాలీగా వచ్చి కాళోజీ జంక్షన్ నుంచి అంబేద్కర్ జంక్షన్‌కు వచ్చే మార్గంలో కార్పొరేట్ కార్యాలయం ఎదుట సమారు 3 గంటల పాటు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాక్ కన్వీనర్ వజీర్, కో- కన్వీనర్ నాగరాజు, కో-చైర్మన్ బి. శంకర్, ఫైనాన్స్ సెక్రెటరీ సదానందం, జాయింట్ సెక్రటరీ చంద్రారెడ్డి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగలు రమేశ్ పాల్గొన్నారు. కాగా, నక్కలగుట్ట నుంచి అంబేద్కర్ వరకు వన్ వే చేసి ఆ మార్గాన్ని సమారు 4 గంటల పాటు బ్లాక్ చేయడం ద్వారా వావాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

రాష్ట్ర స్థాయి ఫొటోగ్రఫీ, షార్ట్ ఫిలిమ్ పోటీలకు ఆహ్వానం

వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా

హనుమకొండ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను (ఫ్లాగ్‌డే) పురస్కరించుకొని వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో విద్యార్థినీ, విద్యార్థులు, యువతీ, యువకులకు ఔత్సాహిక ఫొటో గ్రాఫర్లకు ఫొటోగ్రఫీ, షార్ట్ ఫిల్మ్‌లకు సంబంధించి రాష్ట్ర పోలీసు శాఖ ఆధ్వర్యంలో జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలను నిర్వహిస్తున్నట్టు వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా తెలిపారు. పోలీసు అమర వీరుల ప్రాణా త్యాగాలను స్మరిస్తూ ఈనెల 21 నుంచి 31 వరకు వారోత్సవాలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

ఇందులో భాగంగా పోలీసుల త్యాగాలు, పోలీసులు విధుల్లో ప్రతిభను తెలిపే విధంగా ఉండే ఈ మ ధ్య కాలంలో తీసిన మూడు ఫొటోలు, తక్కువ నిడివి (మూ డు నిముషాలు) గల షార్ట్ ఫిలిమ్స్ తీసి రాష్ట్ర స్థాయి పోటీల కోసం ఈనెల 22వ తేదీలోగా వరంగల్ పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో సంబంధిత షార్ట్ ఫిల్మ్ లోడ్ చేసిన పెన్ డ్రైవ్, 10 ఇంటు 8 సైజ్ ఫొటోలను వరంగల్ సీపీ పీఆర్‌వోకు అందజేయాలన్నారు. ఈ పోటీలకు నామినేషన్లు పంపించే ఔత్సాహికులు మూఢ నమ్మకాలు, ఇతర సామాజిక రుగ్మ తలు, అత్యవసర సమయాల్లో పోలీసుల స్పందన, ప్రకృతి వైపరీత్యాల్లో పోలీసుల సేవ, సైబర్ నేరాలు, ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, మత్తు పదార్థాల సేవనం, వాటి అనర్థాలు ఇతర సం దర్భాల్లో పోలీసుల కీర్తి ప్రతిష్ఠలను పెంపొందించే అంశాలకు సంబంధించి గత సంవత్సరం 2013 అక్టోబరు నుంచి ప్రస్తుత సంవత్సరం అక్టోబరు నెల (ఇప్పటి వరకు) తీసిన మూడు ఫొటోలు, షార్ట్ ఫిల్మ్ మాత్రమే పంపించాల్సి ఉంటుం దన్నారు. మరిన్ని వివరాల కోసం 87126 85050 నెంబర్ ద్వారా పీఆర్‌వోను సంప్రదించాలన్నారు.

బాణసంచా విక్రయ కేంద్రాల అనుమతికి దరఖాస్తుల ఆహ్వానం

హనుమకొండ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : తాత్కాలిక బాణసంచా విక్రయాలకు అనుమతి కోసం ఆసక్తి కలిగిన వ్యక్తులు, సంస్థలు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా వరంగల్ పోలీసు కమిషనర్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. దరఖాస్తు చేసుకునే వారు దరఖాస్తుతో పాటు ప్రైవేటు స్థలాల్లో ఏర్పాటు చేస్తున్నట్లయితే స్థల యజమాని అనుమతి పత్రం, అలాగే ప్రభుత్వ స్థలాల్లో అయితే సంబంధిత ప్రభుత్వ అధికారుల అనుమతి పత్రం, పక్క నిర్మాణాల్లో ఏర్పాటు చేస్తున్నట్లతే వాటి యజమానుల అనుమతితో పాటు పక్క భవనం బ్లూ ప్రింట్, ఎస్‌బీఐ ఆదాలత్ శాఖలో రూ. 800 ప్రభుత్వ ఖజానాకు జమ చేసినట్లుగా బ్యాంక్ చాలన్‌తో దరఖాస్తుకు జతచేయాలని సూచించారు. పూర్తి చేసిన దరఖాస్తులను అక్టోబరు 23వ తేదీలోపు సమర్పించాలని సీపీ కోరారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించిన అనంతరం సంబంధిత అధికారులు అనుమతులు జారీ చేస్తారు. ఎవరైనా ఎలాంటి అనుమతులు లేకుండా బాణాసంచా విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

తొర్రూరు డిపోకు అత్యధిక ఆదాయం

వరంగల్ ఆర్టీసీ రీజియన్‌లో ప్రథమ స్థానం

తొర్రూరు, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి) : బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా తొర్రూరు ఆర్టీసీ డిపోకు అత్యధిక ఆదాయం లభించినట్లు డీఎం పద్మావతి గురువారం తెలి పారు. డిపో నుంచి హైదరాబాద్, వరంగల్, ఖమ్మం వివిధ రూట్‌లలో బస్సులను ఈనెల 14 నుంచి 16వ తేదీ వరకు తిరుగు ప్రయాణంలో రూ. కోటి ఆదాయం వచ్చిందన్నారు. 14వ తేదీ రూ.39 లక్షల 65 వేలు, 15న రూ.32 లక్షలు, 16న రూ.30 లక్షల 31వేల ఆదాయం సమకూరినట్లు వివరించారు. గతేడాదితో పోలిస్తే ఆదాయం అధికంగా పెరిగిందని, ఓఆర్ శాతం కూడా ఎక్కువగా ఉందన్నారు. ఈనెల 14న 148 ఓర్ ఆక్యుపెన్సీతో వరంగల్ రీజియన్ పరిధిలో ప్రథమ స్థానంలో నిలిచామని పద్మావతి తెలిపారు. తొర్రూరు డిపో 1997 లో ఏర్పడగా, ఈనెల 14వ తేదీన అత్యధికంగా రూ.40 లక్షల ఆదాయం రావడం చరిత్ర సృష్టించిందని, వరంగల్ రీజియన్ పరిధిలో తొర్రూరు డిపో 1వ స్థానంలో ఉండగా రాష్ట్రంలో ఆరో స్థానంలో నిలిచిందన్నారు. ప్రత్యేక రూట్‌లలో బస్సులను నడిపి ఆదాయాన్ని సమకూర్చకోవడం జరిగిందని, అత్యధిక ఆదాయం సమకూర్చిన సిబ్బందికి అభినందనలు తెలిపారు.

దంపతుల కుల బహిష్కరణ ?

- దశ దినకర్మకు రావొద్దంటూ పాలివాళ్ల అడ్డగింత
- కుటుంబ కలహాలే కారణం ?
- జనగామ జిల్లాలో ఘటన

స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి దశ దిన కర్మకు హాజరైన దంపతులను వారి పాలివాళ్లు అడ్డగించి కుల బహిష్కరణచేసిన ఘటన జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలోని ఇప్పగూడెం గ్రామంలో గురువారం వెలుగులోకి వచ్చింది. బాధిత దంపతులు తెలిపిన వివరాల ప్రకారం. గ్రామానికి చెందిన 70 ఏళ్ల వృద్ధుడు పది రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. బుధవారం ఆయన దశదినకర్మ ఉండడంతో పాలివాళ్లు పిట్టకు పెట్టే కార్యక్రమానికి వెళ్లారు. వాళ్లతోపాటు బాధిత దంపతులు కూడా అక్కడికి వెళ్లారు. అనంతరం నీళ్లలో మునిగే కార్యక్రమంలో భాగంగా పాలివాళ్లతో కలిసి వారు కూడా నీటిలో మునిగేందుకు ఉపక్రమిస్తుండగా 'మీరు ఇక్కడికి రావద్దు, మా వద్దకు రావద్దు, నీళ్లలో మునగవద్దు' అంటూ పాలివాళ్లు అడ్డుకున్నారు. అక్కడి నుంచి గెంటేశారు. దీంతో చేసేది ఏమీలేక దంపతులు రోదిస్తూ గ్రామంలోకి వెళ్లారు. తమను అకారణంగా అవమానపరిచారని, తాము చనిపోతామని రోదించడంతో అక్కడే ఉన్న గ్రామస్థులు వారిని సముదాయించారు. తమను అవమానపరిచిన తమ పాలివాళ్లు ఐదుగురుపైన బుధవారం రాత్రి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దంపతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని సీఐ జి.వేణు తెలిపారు. అయితే పాలివాళ్ల కుటుంబాల మధ్య జరుగుతున్న గొడవలే వారి బహిష్కరణకు కూడా కారణమని సమాచారం.

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన వీరన్న

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను గురువారం కాం గ్రెస్ ఓబీసీ సెల్ రాష్ట్ర వర్కింగ్ చైర్మన్ మేకల వీరన్న మర్యాద పూర్వకంగా కలిశారు. కేసముద్రంకు చెందిన వీరన్న ఇటీవల ఓబీసీ సెల్ రాష్ట్ర వర్కింగ్ చైర్మన్‌గా నియామకం కాగా, తాజాగా టీపీసీసీ అధ్యక్షుడిని కలిసి, ధన్యవాదాలు తెలిపారు.

ఆటో డ్రైవర్ల సత్తా చాటుతాం

త్వరలో హైదరాబాద్‌లో బహిరంగసభ

ఆటో జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు రవికుమార్



సమావేశంలో మాట్లాడుతున్న మంద రవికుమార్

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) : ఆటోడ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించకుంటే తమ సత్తా చాటుతామని ఆటో జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మందా రవికుమార్ హెచ్చరించారు. మహబూబాబాద్ పట్టణంలో గురువారం రాష్ట్ర జేఏసీ సమావేశన్ని నలమాస సాయి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 7.50 లక్షల మంది ఆటోడ్రైవర్లు, యాజమానులున్నారని వారిపై 30 లక్షల మంది కుటుంబసభ్యులు ఆధారపడి ఉన్నారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలుకు ఆర్టీసీ బస్సు ఉచిత ప్రయాణం పెట్టడంతో ఆటోల్లో ప్రయాణికులు తగ్గి ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

తాము మహాలక్ష్మి పథకానికి వ్యతిరేకం కాదని తమను కూడా ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తం గా ఆర్థిక ఇబ్బందులతో 60మంది చనిపోయారని, వారికి ఒకొక్కరిరి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియో చెల్లించాలని డిమాండ్ చేశారు. సంవత్సరానికి కాకుండా నెలకు రూ.12 వేలు చెల్లించాలని కోరారు. తమ సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ చూపకుంటే హైదరాబాద్‌లో లక్షలాది మందితో బహిరంగ సభను నిర్వహిస్తామని చెప్పారు. ఆటో డ్రైవర్లంతా సమిష్టిగా ఉంటూ హక్కుల సాధనకోసం పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి సాయిలు, నాయకులు మద్దెల రాజేందర్, నీలారపు రవి, వివిధ జిల్లాల అధ్యక్షులు రేణుకుంట్ల సురేష్, జగదీష్‌బాబు, బండి వీరభద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

త్వరలో తండ్రి రిటైర్మెంట్.. తాజాగా కూతురికి పోస్టింగ్



నియామకపత్రాన్ని అందుకుంటున్న దివ్యవాణి, పక్కన తండ్రి అంజయ్య

రాయపర్తి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మరికొద్ది రోజుల్లో ఆ ఉపాధ్యాయుడు రిటైర్ అవబోతుండగా.. ఇటీవలి నియామకాల్లో ఆయన కూతురు టీచర్‌గా కొలువు సాధించారు. అంతే కాదు ఆయన పనిచేస్తున్న మండలంలోనే ఆమె కూడా జాయిన్ అవడం అరుదైన సంఘటన. దీనికి సంబంధించిన వివరాలివీ. వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలోని పెర్కవేడు గ్రామానికి చెందిన పున్నం అంజయ్య 22ఏళ్లుగా ఇదే గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఆయన ఈ నెలాఖరున పదవీవిరమణ పొందనున్నారు. ఈ క్రమంలో ఆయన కూతురు దివ్యవాణి ఇటీవలి డీఎస్సీ పోస్టింగ్‌లో కొలువు సాధించి రాయపర్తి మండలంలోని గన్నారం ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా నియమితులయ్యారు. దీంతో ఆ తండ్రీకూతుళ్ల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. గురువారం దివ్యవాణి ఎంఈవో కార్యాలయంలో ఎంఈవో నోముల రంగయ్యను కలిసి తన అపాయింట్ మెంట్ పత్రాన్ని అందజేయగా ఆమె వెంట తండ్రి అంజయ్య కూడా ఉన్నారు. ఈ క్రమంలో తామిద్దరం పనిచేసేది వేర్వేరు పాఠశాలల్లోనే అయినా ఈ నెలాఖరున తన రిటైర్మెంట్ ఉండ గా.. తన ఉపాధ్యాయ వారసురాలిగా దివ్యవాణి అదే మండలంలో విధుల్లో చేరడం ఆనందంగా ఉందని అంజయ్య మురిసి పోయా రు. తోటి ఉపాధ్యాయులు, అధికారులు కూడా అంజయ్య, దివ్యవాణిలను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.


లక్ష్మీ పంప్‌హౌస్ విద్యుత్ బకాయి రూ. 523.84 కోట్లు

మహదేవపూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని మేడిగడ్డ బ్యారేజీ లక్ష్మీ పంప్‌హౌస్ విద్యుత్ బకాయి రూ. 523 కోట్ల 84 లక్షల 676 పేరుకుపోయింది. 2019 జూన్ 21న ప్రాజెక్టు ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు 163 టీఎంసీల నీళ్లను దిగువకు ఎత్తిపోశారు. పంప్‌హౌస్ ప్రారంభం నుంచి ఈఏడాది ఆగస్టు వరకు విద్యుత్ బిల్లు మొత్తం రూ.833 కోట్లు పేరుకుపోగా అందులో రూ. 320 కోట్లు చెల్లించారు. ఇంకా 513 కోట్లు చెల్లించాల్సి ఉండగా సెప్టెంబరు బిల్లు రూ.10.84 కోట్లు వచ్చింది. ఇలా విద్యుత్ శాఖకు ఇంకా రూ. 523.84 కట్టాల్సి ఉందని సంబంధత అధికారులు తెలిపారు.

మహబూబాబాద్ జిల్లాలో 111.2 మి.మీ వర్షపాతం

మహబూబాబాద్ అగ్రికల్చర్, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లాలో బుధవారం నుంచి గురువారం ఉదయం 8.30 గంటల వరకు 111.2 మిల్లిమీటర్ల వర్షపాతం నమోదైంది. బయ్యారంలో 1.4, డోర్నకల్‌లో 1.0, కురవిలో 8.2, మహబూబాబాద్‌లో 7.2, గూడూరులో 8.2, కేసముద్రంలో 13.6, నెల్లికుదురులో 16.2, నర్సింహులపేటలో 5.4, చిన్నగూడూరులో 6.4, మరిపెడలో 3.6, తొర్రూరులో 21.6, పెద్దవంగరలో 18.4 మిల్లిమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలో సగటున 7.0 మిల్లిమీటర్ల వర్షపాతం నమోదైంది.

రాష్ట్ర స్థాయి పోటీలకు తిమ్మంపేట విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

జఫర్‌గడ్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు మండలంలోని తిమ్మంపేట విద్యార్థులు ఎంపికయ్యారు. జనగామలో జరిగిన జిల్లా స్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో తిమ్మంపేట జడ్పీ హైస్కూల్‌కు చెందిన బుల్లె స్పందన, పెండ్లి నిఖిత, లకావత్ దీపిక, మాచర్ల రిషిత (9వ తరగతి), భూక్య రాణి (8వ తరగతి) పాల్గొని అత్యుత్తమ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని హైస్కూల్ హెచ్‌ఎం షారోన్ గురువారం తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలు ఈనెల 18 నుంచి 20వ తేదీ వరకు వరంగల్‌లో జరుగుతాయన్నారు. ఎంపికైన విద్యార్థులను జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి భగత్, పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యా యుల తో పాటు అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ భాగ్యమ్మ, పాఠశాల దాత ప్రవీణ్‌రెడ్డి అభినందించారు.

రైల్వే సొరంగ మార్గంలో లీకేజీలు !

- స్లాబ్ నుంచి నీరు లీకై పట్టాలపైకి
- అప్రమత్తం కాకుంటే ఇబ్బందే



సొరంగమార్గంలో లీకైన స్లాబు



స్లాబు నుంచి నీరు కారి తడిసిన పట్టాలు

కాజీపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కాజీపేట - హసన్‌పర్తి రైల్వేస్టేషన్ల మధ్య కోమటిపల్లి సమీపంలో నిర్మించిన రైల్వే సొరంగమార్గం ప్రారంభమై నెలరోజులైనా గడవకముందే అప్పుడే లీకేజీలు మొదలయ్యాయి. ఈ మధ్య కురిసిన చిన్నపాటి వర్షానికే నీరు లీకై రైల్వే ట్రాక్‌లపై పడటంతో రైల్వే ఉద్యోగుల్లో ఆందోళన మొదలైంది. దక్షిణ మధ్య రైల్వేలోనే మొదటసారిగా సుమారు రూ. 30 కోట్లతో రైల్వే శాఖ ఓ చాలెంజింగ్‌గా సొరంగ మార్గం నిర్మించిన సంగతి తెలిసిందే. 350 మీటర్ల మేర నిర్మించిన ఈ సొరంగమార్గంపై నాలుగు ఫీట్ల స్లాబ్ దానినిపై మట్టి, కంకర, పైన పట్టాలపై ట్రాక్ అనుసంధానికి ఏర్పాటు చేసిన సిమెంట్ దిమ్మెలు, ఇన్ని మరమ్మతు చేసి నిర్మించిన స్లాబ్‌నుంచి చిన్న వర్షానికే లీకై నీరు కిందివరకు రావడంపై విమర్శలు వస్తున్నాయి. ఒక వేళ భారీ వర్షాలు వరదలు వస్తే పరిస్థితి ఎలా ఉంటుందోనని పలువురు ఆందోళన చెందుతున్నారు. ఈ సొరంగ మార్గం ప్రత్యేకత ఏంటంటే ఏక కాలంలో పైనుంచి, కిందనుంచి రైళ్ల రాకపోకలు సాగుతుంటాయి. ఇంత ప్రాధాన్యం కలిగిన సొరంగ మార్గాన్ని రైల్వే అధికారులు అప్రమత్తమై ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.



చెత్తా చెదారంతో నిండిపోయిన మధ్యకోటలోని కోడికూత బావి



ముళ్ల పొదలతో నిండి ఉన్న సింగారపు బావి

కాలగర్భంలో కలుస్తున్నాయ్..

అధ్వానస్థితిలో కాకతీయుల కాలం నాటి బావులు

- చెత్తా చెదారంతో నింపేస్తున్న స్థానికులు
- పురాతన కట్టడాల రక్షణ మరిచిన అధికారులు

ఖిలావరంగల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఓరుగల్లు అంటేనే కాకతీయుల నాటి కళా సంపదకు నిలయం. నాటి కాలంలో నిర్మించిన ఎన్నో ఆలయాలు, సరస్సులు, బావులు పర్యావరణ, ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకుంటున్నాయి. క్రీ.శ 11వ శతాబ్దం నుంచి 13వ శతాబ్దం వరకు దక్షిణ దేశాన్ని పరిపాలించిన కాకతీయ రాజులు.. తమకు రక్షణగా ఉండేందుకు మట్టి, రాతికోటలు, దేవాలయాలు, చెరువులు, బావులను తవ్వించారు. ఆ సమయంలో వరంగల్ ఉమ్మడి జిల్లాతో పాటు వరంగల్ కోటలో అనేక బావులను తవ్వించారు. వాటిలో రామప్ప, లక్నవరం, పాకాల, ములుగు, ఘణపురం, భద్రకాళి, గుండు చెరువులతో పాటు రాతి, మట్టికోటల చుట్టూ కందకాలను తవ్వి వాటిలో నీటిని నింపేవారు. అలాగే ఖిలావరంగల్ దిగుడు, మెట్లు, సింగారపు, కోనేరు తదితర బావులను నిర్మించారు. వాటిలో సంవత్సరం అంతా నీరు ఉండేదని పెద్దలు చెబుతున్నారు. ఇక రాజులు స్నానాలు చేయడానికి ఖిలావరంగల్ మధ్యకోటలో సింగారపు బావి, శివనగర్‌లో మెట్లు, కోడికూత, సవతులు, అక్కాచెల్లెళ్ల, గడియారం, అవుసుల, ఈసన్న, తలుపుల, తదితర బావులున్నాయి. ప్రస్తుతం ఖిలావరంగల్ మూడు కోటల్లో జనాభా విస్తరణ కావడంతో జనావాసాల మధ్యలో ఉన్న కోడికూత, ఈసన్న, తలుపుల, అవుసుల బావులను పట్టించుకునే వారు లేకపోవడంతో స్థానికులు ఇష్టారీతిన చెత్తాచెదారం వేస్తున్నారు. దాంతో పాటు వాటిలో, వాటి చుట్టూ చెట్లు, ముళ్లపొదలు పెరిగి అడవులను తలపిస్తున్నాయి. పర్యాటకులు అందులోకి వెళ్లి బావులను చూసేందుకు భయపడే పరిస్థితి ఉంది. ఇలా పురాతన కాలం నాటి బావులు కాలగర్భంలో కలిసి, ఆనవాళ్లు లేకుండా పోవడం పట్ల పర్యావరణ, పర్యాటక ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పురాతన కాలంనాటి చెరువులు, బావులను పరిరక్షించి ముందుతరాలకు అందించాల్సిన అవసరం ఉందని పర్యాటక, చరిత్రకారులు, పెద్దలు కోరుతున్నారు.



ఖిలావరంగల్ కాపువాడలో ఉన్న ఈసన్నబావి చెత్తతో నిండిపోయిన దృశ్యం

సూచిక బోర్డులు, దారులను ఏర్పాటు చేయాలి

తోట రాజు, ఖిలావరంగల్



ఖిలావరంగల్ ప్రాంతానికి వచ్చే దారిలో సూచికబోర్డులను ఏర్పాటు చేసి, చారిత్రక ప్రసిద్ధి చెందిన దేవాలయా లు, కట్టడాలు, బావులకు దారులను నిర్మించాలి. దీంతో దేశ, విదేశాలతో పాటు ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి వచ్చే పర్యాటకులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉంటుంది.

చారిత్రక కట్టడాలు, బావులను పరిరక్షించాలి

ఎండీ. సలీంఖాన్, మధ్యకోట



పర్యాటక ప్రదేశాలకు కేంద్రమైన కాకతీయుల కట్టడాలు, ఆలయాలు, చెరువులు, బావులను రక్షించి ముందు తరాలకు అందించాలి. లేదంటే వేల సంవత్సరాల చరిత్ర కలిగిన అద్భుత కట్టడాలు, చెరువులు, బావులు కాలగర్భంలో కలిసి పోతాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పురాతన కట్టడాలను పరిరక్షించేలా మరిన్ని పటిష్ఠ చర్యలు తీసుకోవాలి.

కొండెక్కిన కొబ్బరి

- వర్షాలు, గాలిదుమారాలతో తగ్గిన దిగుమతి
- రకం, సైజును బట్టి ఒక్కోకాయ రూ.35కి విక్రయం
- ఉమ్మడి జిల్లాకు తమిళనాడు నుంచి వస్తున్న సరుకు
- కొబ్బరి బొండాల ధరలూ పెరిగిన వైనం




వరంగల్ చౌరస్తా, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : పండుగలు, శుభ, అశుభకార్యాలు సందర్భం ఏదైనా.. ఆలయాల సందర్శనకు వెళ్లినా.. ప్రతీ ఒక్కరు ఉపయోగించేది కొబ్బరి కాయ. అసలు ఈ కొబ్బరికాయ లేనిదే ఏ కార్యక్రమం కూడా పరిపూర్ణత ఉండదని అందరి నమ్మకం. అలాంటి కొబ్బరి కాయ ధరలు కొండెక్కాయి. ఏకంగా 50 శాతం నుంచి 100శాతం వరకు ధరలు పెరిగాయి. ఇందుకు ఇటీవలి భారీ వర్షాలు, గాలిదుమారాలే కారణమని చెబుతున్నారు. భారీ వర్షాలతో ఆంధ్రా ప్రాంతంలోని భీమవరం, పాలకొల్లు ఇతర ప్రాంతాల్లో పంటకు తీవ్ర నష్టం జరుగడంతో కొబ్బరికాయల ఉత్పత్తి తగ్గింది. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాపారులు తమిళనాడు నుంచి కాయను దిగుమతి చేసుకుంటున్నారు. తెలంగాణలోనే హైదరాబాద్ తర్వాత అతి పెద్ద వ్యాపార కేంద్రంగా ఉన్న వరంగల్ బీట్ బజార్ మార్కెట్‌కు గతంలో ఏపీ నుంచి నిత్యం 8 లారీల్లో దాదాపు 2లక్షల కొబ్బరికాయలు వచ్చేవి. అందులో నిత్యం దాదాపు 80 శాతం అమ్మకాలు జరిగేవి. ప్రస్తుతం ఏపీ నుంచి దిగుమతి సగానికి తగ్గింది. ఇక వారం రోజుల నుంచి తమిళనాడులో కూడా భారీ వర్షాలు వస్తుండటంతో కొబ్బరి పంటకు నష్టం వాటిల్లి అనుకున్నంత సరుకు ఇక్కడికి రావడం లేదు. దీంతో రోజుకు రూ.30లక్షల మేర జరిగే వ్యాపారం కాస్తా కుంటుపడింది. రెండు నెలల క్రితం నాలుగు రకాల సైజుల్లో ఉండే కొబ్బరికాయలకు ఒక్కొక్కటి రూ.10 నుంచి రూ.20 వరకు విక్రయించే వారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఆ ధరలు రూ.15 నుంచి రూ.35కు పెరిగాయి. మరోవైపు కొబ్బరిబొండాల ధరలు కూడా అంతే ఉన్నాయి. గతంలో సైజు, రకాన్ని బట్టి ఒక్కో బొండాం రూ.15 నుంచి రూ.20 వరకు విక్రయించే వారు. కానీ ఇప్పుడు ఏర్పడిన కొరత కారణంగా రూ.40వరకు అమ్ముతున్నారు.



శ్రమైక జీవన సౌందర్యం.. నిండు చంద్రుడి సోయగం..

శ్రమైక జీవన సౌందర్యానికి.. నిండు పౌర్ణమి చంద్రుడి సోయగం తోడైతే.. ఆ సుందర దృశ్యం కళ్లముందు ఆవిష్కృతమైతే పరవశించని మనసుంటుందా. చూడముచ్చటైన ఆ ప్రకృతి గీసిన సహజ రూపాన్ని స్వీకరించని, ఆస్వాదించని హృదయం ఉంటుందా. పున్నమి వేళ.. సంధ్యాసమయాన.. చంద్రకాంతి వెదజల్లుతున్న వేళ ఇదిగో ఇలా ఓ గీత కార్మికుడు కల్లు గీసేందుకు తాటిచెట్టు ఎక్కుతూ అద్భుత దృశ్యానికి ఆయువు పోశాడు. ఈ అపురూప చిత్రం వరంగల్ జిల్లా గీసుగొండ మండలం గట్టుకిందిపల్లి వద్ద ఆవిష్కృతమైంది.

ఫొటో : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, హనుమకొండ





గోదావరి హారతి ఇస్తున్న అర్చకులు

వైభవంగా గోదావరి హారతి

మహదేవపూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాళేశ్వరంలో గోదావరి హారతి కార్యక్రమం గురువారం వైభవంగా జరిగింది. కాళేశ్వర ముక్తీశ్వర దేవస్థానం నుంచి అర్చకులు, ఆలయ నిర్వాహకులు మంగళవాయిద్యాలతో గోదావరి ఒడ్డుకు చేరుకొని హారతి ఇచ్చారు. ఆలయ సూపరింటెండెంట్ బుర్రి శ్రీనివాస్, మాజీ ధర్మకర్త శ్యాంసుందర్, అర్చకులు, వేద పండితులు, సిబ్బంది, గ్రామస్థులు, భక్తులు, అన్నమయ్య సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు. దేవాదాయశాఖ ఆదేశాలమేరకు ప్రతి పౌర్ణమికీ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

రంగనాథుడిని తాకిన సూర్య కిరణాలు

కాశిబుగ్గ, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): కాశిబుగ్గలోని రంగనాథ ఆలయంలో స్వామిపై గురువారం సూర్యకిరణాలు పడ్డాయి. ఉదయం 6.30గంటల ప్రాంతంలో సూర్యకిరణాలు పడ్డ విషయం స్థానికులకు తెలియడంతో భక్తుల రద్దీ పెరిగింది. దేవాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వంగరి రవి, ప్రధాన కార్యదర్శి చిలువూరి సురేష్, కోశాధికారి సుల్తానా సమ్మక్క, ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణమాచార్యులు, శ్రీనివాస్, కవిత, ప్రకాష్‌రెడ్డి, ప్రసాద్, భాస్కర్ పాల్గొన్నారు.



రంగనాథ స్వామిపై పడిన సూర్యకిరణాలు



వరంగల్ 27వ డివిజన్‌లో పెద్దమ్మ తల్లికి బోనాలు సమర్పిస్తున్న కార్పొరేటర్ అనిల్‌కుమార్, భక్తులు

ఘనంగా పెద్దమ్మ తల్లి బోనాలు

గిర్మాజీపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరం 27వ డివిజన్‌లోని గోవిందరాజుల గుట్ట ప్రాంతంలోని పెద్దమ్మ తల్లి ఆలయంలో స్థాని క కార్పొరేటర్ చింతాకుల అనిల్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి ముదిరాజ్‌లు బోనాల పండుగ జరుపుకున్నారు. మహిళలు తలపై బోనాలు పెట్టుకుని పెద్దమ్మ తల్లి ఆలయానికి చేరుకుని బోనాలు సమర్పించి మొక్కులు సమర్పించుకున్నారు. కుటుంబ సభ్యులను చల్లంగా చూడాలంటూ తల్లిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు సునీల్ కుమార్, ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు జగదీష్, అర్బన్ అధ్యక్షుడు బి.స్వామి, ముదిరాజ్ నాయకులు ఆదినారాయణ, మహేష్, చందర్, నర్ర శివ పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ జట్ల ఎంపిక

కాశిబుగ్గ, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాల క్రికెట్ జట్ల ఎంపిక గురువారం ముగిసింది. రెండు రోజులుగా సీకేఎం కళాశాల మైదానంలో కార్యక్రమం నిర్వహించారు. వరంగల్, హనుమకొండ, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, జనగామ, మహబూబాబాద్ జిల్లాల జట్లను ఎంపిక చేశారు. ఈ జట్లు ఈనెల 20 నుంచి 23 వరకు జరిగే అండర్- 23 లీగ్ కమ్ నాకౌట్ పోటీల్లో పాల్గొననున్నట్లు వరంగల్ ఉమ్మడి జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో రాణించిన క్రీడాకారులు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరంగల్ కేంద్రంగా నవంబర్ 4నుంచి 6వరకు జరిగే అండర్-23 అంతర్ జిల్లా పోటీల్లో పాల్గొనే ఉమ్మడి వరంగల్ జిల్లా జట్టుకు ఎంపికవుతారని వివరించారు.



ఎంపికైన క్రికెట్ జట్టు

కేయూకు రెగ్యులర్ వీసీ?

- నేడో, రేపో ఉత్తర్వుల జారీకి అవకాశం
- నియామకంపై కొనసాగుతున్న ఉత్కంఠ

కేయూ క్యాంపస్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీకి ఈసారి రెగ్యులర్ వైస్ చాన్స్‌లర్ నియామకం జరగనున్నట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఇటీవలి వరకు కేయూ ఇన్‌చార్జ్ వీసీగా విధులు నిర్వహించిన ఐఏఎస్ అధికారి వాకాటి కరుణ ఏపీకి వెళ్లిపోవడంతో కేయూ వీసీ పోస్టుకు ఖాళీ ఏర్పడింది. అయితే కేయూ వీసీ పోస్టులోకి రాష్ట్ర ప్రభుత్వం అత్యవసరంగా మరొకరిని నియామిస్తారని శుక్రవారం రాత్రి వరకు వర్సిటీ వర్గాలు ఉత్కంఠగా ఎదురుచూశాయి. కానీ చివరి నిమిషంలో విద్యాశాఖ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం నేడో, రేపో కాకతీయ యూనివర్సిటీకి రెగ్యులర్ వీసీని నియమిస్తామని, ఇంతలో ఇన్‌చార్జ్ వీసీగా మరొకరిని నియమించాల్సిన అవసరం లేదని అన్నట్టు సమాచారం. అదే సమయంలో కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డికి కూడా రాష్ట్ర ప్రభుత్వం నేడో, రేపో కచ్చితంగా రెగ్యులర్ వీసీని నియమిస్తుందని, ఇన్‌చార్జ్ వీసీ అవసరం లేదని, రెగ్యులర్ వీసీ వచ్చే వరకు తాత్కాలికంగా చూసుకోవాలని చెప్పినట్టు తెలుస్తోంది. ఈ లోపు ఏదైనా అత్యవసరమైన సమాచారం ఉంటే తన దృష్టికి తేవాలని ఆదేశాలిచ్చారని సమాచారం. ఏదేమైనా వర్సిటీ చరిత్రలో వీసీ లేకపోవడం చర్చనీయంగా మారింది.

ఆడించే వారేరీ?

- క్రీడలకు నోచుకోని ప్రభుత్వ డిగ్రీ, ఇంటర్ విద్యార్థులు
- ఉమ్మడి జిల్లాలో 17 డిగ్రీ కాలేజీల్లో నలుగురే పీడీలు
- 50 జూనియర్ కళాశాలల్లో ఒక్కరూ లేని వైనం
- అధ్యాపకులతోనే నామమాత్రంగా ఆటల నిర్వహణ



మహబూబాబాద్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల క్రీడా మైదానం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుల్లోనే కాదు.. క్రీడారంగంలోనూ రాణించాలని పాలకులు తమ ప్రసంగాల్లో ఊదరగొడుతుంటారు. క్రీడల ద్వారా మానసిక, శారీరక ఉల్లాసం సొంతమవుతుందంటారు. అలాంటి క్రీడల నిర్వహణకు, క్రీడా రంగం అభివృద్ధికి అధిక నిధులు కేటాయిస్తున్నామని చెబుతున్నారు. కానీ అది ఆచరణలో మాత్రం అమలవుతున్నట్టు కనిపించడం లేదు. అందుకు ఉమ్మడి వరంగల్ జిల్లాల్లోని ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలల్లోని విద్యార్థులకు ఆటలు ఆడించే వారే కనపడకపోవడమే నిదర్శనం. మొత్తం 17 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలుండగా, మూడు కళాశాలల్లో మాత్రమే ఫిజికల్ డైరెక్టర్‌లున్నారు. కాగా, కొన్ని కళాశాలల్లో పోస్టులే మంజూరు కాకపోవటంతో పాటు మొత్తంగా 14 కాలేజీల్లో ఫిజికల్ డైరెక్టర్లు లేకపోవటం గమనార్హం. ఉమ్మడి జిల్లాలో 50 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా, ఒక్క కళాశాలలో కూడ ఫిజికల్ డైరెక్టర్లు లేరంటే అతిశయోక్తి కాదేమో. అన్ని కళాశాలలకు నామ్‌కే వాస్తేగా అధ్యాపకులతోనే క్రీడలు నిర్వహిస్తున్నారు. జిల్లాల ఏర్పాటు తర్వాతనైనా ఉన్నతస్థాయి అధికారులు దృష్టి సారిస్తారనుకుంటే కొత్త జిల్లాలు ఏర్పడి కూడా రెండేళ్లు పూర్తికావస్తున్నా ఒక్క కళాశాలకు పీడీని నియమించలేక పోయారు. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని డిగ్రీ, జూనియర్ కళాశాలకు ఇచ్చిన క్రీడా సామాగ్రి వినియోగంలో లేక మూలకు పడింది.

క్రీడా మైదానాలు సరే.. ఆడించే వారేరీ?

ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో కొత్తగా ఏర్పడిన మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, జనగామ జిల్లాల పరిధిలో 17 డిగ్రీ, 50 ప్రభుత్వ జూనియర్ కళాశాలలున్నాయి. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించేలా ప్రభుత్వం ప్రతీ కళాశాలకు రూ.లక్షల విలువగల క్రీడావస్తువులను సరఫరా చేసినప్పటికి ఫిజికల్ డైరెక్టర్ (పీడీ)లను నియమించలేదు. పాఠశాల స్థాయిలో క్రీడారంగంలో జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిల్లో రాణించి పదో తరగతి తర్వాత ఇంటర్మీడియట్, డిగ్రీ విద్య కోసం కళాశాలల్లో చేరిన విద్యార్థులకు కళాశాలల్లో క్రీడలు నిర్వహించకపోవటంతో విద్యార్థులు నిరుత్సాహానికి గురవుతున్నారు. రాష్ట్రప్రభుత్వం విద్యాబోధనతో పాటు క్రీడారంగాన్ని ప్రోత్సహించేందుకు కళాశాల కీలకదశ అని చెప్పుకోవచ్చు. క్రీడాకారులు ఉన్నతచదువులు, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో స్పోర్ట్స్ కోటాలో సీట్లు సాధించుకునే అవకాశం ఉంటుంది. కళాశాలల్లో క్రీడల్లో తర్ఫీదు నిచ్చే పీడీలు లేకపోవడంతో విద్యకే పరిమితం కావాల్సి వస్తోంది. క్రీడల పట్ల ఆసక్తి ఉన్నా అవకాశం లేకవారి భవిష్యత్ చేజార్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. క్రీడలకు పుట్టినిల్లు ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇలాంటి పరిస్థితి నెలకొంటే ఇక మారుమూల ప్రాంత విద్యార్థుల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థమవుతోంది. ఇప్పటికైనా పీడీలను నియమించి క్రీడాకారులను తీర్చిదిద్దాల్సిన బాధ్యత పాలకులు, అధికారులపై ఉంది. ఆదిశగా ప్రయత్నాలు చేయాలని విద్యార్థుల తల్లి దండ్రులు కోరుతున్నారు.

కనిపించని క్రీడా వస్తువులు

ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలల విద్యార్థులు క్రీడల్లో ఆసక్తి కనబరుస్తున్నా గత ఎనిమిదేళ్లుగా క్రీడా వస్తువులు అందడంలేదు. వాలీబాల్, బాస్కెట్ బాల్, క్యారంబోర్డు, క్రికెట్ కిట్, చెస్, ఫుట్‌బాల్, షటిల్‌బ్యాట్లు, షాట్‌పుట్, జావలిన్ త్రో, టెన్నికాయిట్, డిస్కస్‌త్రో, టెన్నిస్‌బాల్,స్కిప్పింగ్ క్రీడల్లో విద్యార్థులు రాణిస్తున్నా ఆటలు ఆడించే వ్యాయామ ఉపాధ్యాయులు లేకపోవడం దేవుడెరుగు. క్రీడలపై ఆసక్తిఉన్న క్రీడాకారులు స్వతహాగా ఆడేందుకు కూడా క్రీడా కిట్లు అందుబాటులో లేకపోవడంతో నిరాశకు లోనవుతున్నారు.

సొంత ఖర్చులతోనే వర్సిటీ స్థాయి పోటీలకు..

యూనివర్సిటీ స్థాయి క్రీడల్లో పాల్గొనేందుకు వెళ్లే క్రీడాకారులు స్వంత డబ్బులతోనే వెళ్లి పోటీల్లో పాల్గొనాల్సి వస్తుందని వాపోతున్నారు. గతంలో క్రీడల్లో పాల్గొనేందుకు వెళ్లే క్రీడాకారులను కళాశాలలకు వచ్చే నిధుల నుంచి వ్యాయామ ఉపాధ్యాయులు తీసుకువెళ్లేవారు, అంతే కాకుండా క్రీడా డ్రెస్‌లను కూడా కళాశాలల నుంచే సమకూర్చేవారు. కానీ, అవేమి లేకపోవడంతో విద్యార్థులు సైతం ఆసక్తి చూపడంలేదనే విమర్శలు లేకపోలేదు.

జిల్లాల వారీగా జూనియర్ కళాశాలలు, పీడీలు

జిల్లా	కళాశాలలు	పీడీల సంఖ్య
వరంగల్	11	0
హనుమకొండ	09	0
మహబూబాబాద్	10	0
జయశంకర్ భూపాలపల్లి	05	0
ములుగు	08	0
జనగామ	07	0
మొత్తం	50	00

జిల్లాల వారీగా డిగ్రీ కళాశాలలు, ప్రస్తుతం ఉన్న పీడీలు

జిల్లా	కళాశాలలు	పీడీల సంఖ్య
వరంగల్	05	01
హనుమకొండ	02	01
మహబూబాబాద్	05	0
జయశంకర్ భూపాలపల్లి	02	0
జనగామ	01	01
ములుగు	02	01
మొత్తం	17	04

క్రీడలకు నిధులు కేటాయించాలి

బి.అజయ్, మాజీ జాతీయ క్రీడాకారుడు, మహబూబాబాద్



క్రీడలకు నిధులు కేటాయించాలి. స్వరాష్ట్రంలోనైనా క్రీడలకు పెద్ద మొత్తంలో నిధులు కేటాయించి క్రీడాకారులను ప్రోత్సహించాలి. మానుకోట డివిజన్ క్రీడా కారులకు పుట్టినిల్లుగా పేరుగాంచింది. ప్రభుత్వం పాఠశాల స్థాయి నుంచి కళాశాల స్థాయి వరకు విద్యార్థులను క్రీడారంగంలో రాణించే విధంగా చూడాలి.

వ్యాయామ ఉపాధ్యాయులను నియమించాలి

బొడ్డుపెల్లి ఉపేందర్, మాజీ జాతీయ ఖోఖో క్రీడాకారుడు, మహబూబాబాద్



క్రీడాకారులకు తర్ఫీదు నిచ్చేందుకు పాఠశాల స్థాయి నుంచి కళాశాల స్థాయి వరకు వ్యాయామ ఉపాధ్యాయులను నియమించాలి. పాఠశాలలు, కళాశాలల్లో సాయంత్రం వేళల్లో క్రీడలకు సమయం కేటాయించాలి. వ్యాయామ ఉపాధ్యా యులులేక క్రీడలు నిర్వహించకపోవటంతో పాటు క్రమశిక్షణ కొరవడుతుంది. ప్రభుత్వం వ్యాయామ ఉపాధ్యాయుల నియామకాలను చేపట్టాలి.

న్యూస్ బాక్స్

అపరిచితులతో జాగ్రత్త

రఘునాథపల్లి, అక్టోబరు 17: అపరిచిత వ్యక్తులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రఘునాథపల్లి సీఐ ఎడవెల్లి శ్రీనివాస్ రెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంకు వద్ద గురువారం ప్రజలకు అవగాహన కల్పించారు. బ్యాంకులకు వెళ్లి డబ్బులు డ్రా చేసి వాటిని తీసుకెళ్తున్న క్రమంలో చుట్టు పక్కల అపరిచితులు అని జాగ్రత్తగా గమనించాలని సీఐ సూచించారు. అనుమానం కలిగితే వెంటనే 100కు గాని, పోలీస్ స్టేషన్‌కు గానీ ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ డి.నరేష్ పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి బహూకరణ

రఘునాథపల్లి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఖిలాషాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 2003-04 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు పాఠశాలకు గురువారం సుమారు రూ.16 వేల విలువైన క్రీడా సామగ్రిని అందించారు. హెచ్ఎం భారత రవిందర్‌కు అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పుప్పాల వేణుకుమార్, రాజశేఖర్, బండి శంకర్, జక్కుల శివ, యాకుబ్ పాష, బొడ్డు జంపన్న, గాదె సంజీవ, ఫిజికల్ డైరెక్టర్ సోమన్న, సిఆర్‌పి శ్రీనివాస్, నర్సింగరావు పాల్గొన్నారు.

ఉద్యోగుల్ని తొలగించొద్దు..

జనగామ రూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఏఈవోలు, ఏటీఎంఏ సిబ్బందిని తొలగిస్తామనడం సరైంది కాదని కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఏఈవోలు అన్నారు. గురువారం ఉద్యోగులు, సిబ్బంది ఏఈవో రామారావుకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 8 ఏళ్లుగా వ్యవసాయ శాఖలో అత్యవసర సమయంలో తమ విలువైన సేవలను అందించామన్నారు.

స్వప్రయోజనాలకే పదవులు

బచ్చన్నపేట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): గతంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఎన్నికైన వారు అధికార పార్టీలకు వత్తాసు పలుకుతూ పదవులను స్వప్రయోజనాలకు వాడుకున్నారని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు చల్లా తిరుపతిరెడ్డి అన్నారు. గురువారం మండలంలో ఇటీవల కొత్తగా పాఠశాలల్లో చేరిన ఉపాధ్యాయులను కలవటంతోపాటు ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఓటరు నమోదు కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమాల్లో తపస్ జిల్లా మండల నేతలు మల్లారెడ్డి, భాస్కరుని పృథ్వీరాజ్, మునిని వేణుగోపాల్, నవీన్, రాములు, కోటి పాల్గొన్నారు.

26న వికలాంగుల విజృంభన సభ

బచ్చన్నపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం వికలాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నవంబరు 26న వికలాంగుల విజృంభణ సభకు పెద్ద ఎత్తున జిల్లాలోని పెన్షన్‌దారులు హాజరై మద్దతు తెలపాలని వీహెచ్‌పీఎస్ జిల్లా కన్వీనర్ గడ్డం సోమరాజ్ పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ పెన్షన్ పెంపుతోపాటు పలు కీలక హామీలను ప్రభుత్వం విస్మరించిందన్నారు. సమావేశంలో పత్తి సిద్దిరాములు, అల్వాల యాదగిరి, వెంకట నర్సయ్య, సిద్దిరాములు, మల్లేశం పాల్గొన్నారు.



బందనాగారంలో..

బసిరెడ్డిపల్లిలో పిచ్చి మొక్కలతో నిండిన క్రీడా ప్రాంగణం

ఆటంకం!

బచ్చన్నపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ, పట్టణ స్థాయిలో క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో తెలంగాణ ప్రభుత్వం క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. ఒక్కో ప్రాంగణానికి రూ. లక్ష నుంచి రూ.3లక్షల వరకు ఖర్చు చేశారు. నిర్వహణ తీరు సరిగా లేక నిరుపయోగంగా మారాయి. క్రీడా మైదానాలు ఏర్పాటు చేసి రెండేళ్లకు పైనే అయినా, ఆటలు ఆడేందుకు అందులోకి అడుగు పెట్టిన దాఖలాలు లేవంటున్నారు. ఆటలకు అనువుగా లేని ప్రదేశాల్లో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయటం మూలంగానే వృథాగా పడి ఉంటున్నాయనే విమర్శలున్నాయి. గ్రామాల్లో విద్యార్థులు, యువకులు ఆటలు ఆడుకునేందుకు ప్రత్యేక ఆట స్థలాలు ఉండాలనే మంచి ఆలోచన ప్రభుత్వాలు చేసినా గ్రామాలకు కొన్ని దూరంగా ఏర్పాటు చేయటం, కూడా లక్ష్యం నెరవేరలేక పోతోందంటున్నారు. ప్రాంగణంలో వాలీబాల్, ఖోఖో, కబడ్డీ ఆటలకు అనుకూలంగా తీర్చిదిద్దాలి. అలాగే ఎక్సర్‌సైజ్ బార్‌లను ఏర్పాటు చేయాలి. లాంగ్‌జంప్‌కు అనుగుణంగా మైదానంలో ఒకవైపు ఇసుక పోసి తయారు చేయాలి. ఇంత వరకు నిబంధనలు బాగానే ఉన్నా క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. రాత్రికి రాత్రే స్థలాలు గుర్తించాలని, పనులు ప్రారంభించాలని అధికారులు పురమాయించటంతో పనులు నామమాత్రంగా చేసి వదిలేశారనే ఆరోపణలున్నాయి. ప్రస్తుతం మైదానాల వద్దకు వెళ్లి చూస్తే పిచ్చిమొక్కలు, చెట్లు పెరిగి క్రీడాభిమానులను వెక్కిరిస్తున్నాయి. మంచి సంకల్పంతో కోట్లాది రూపాయలు వెచ్చించినప్పటికి సరైన క్రీడా పరికరాలు ఏర్పాటు చేయకపోవటంతో వినియోగించుకోలేకపోతున్నట్టు విద్యార్థులు, యువకులు చెబుతున్నారు.

వాలీబాల్, ఖోఖోల కోసం ఏర్పాటు చేసిన స్తంభాలు తుప్పుపట్టి శిథిలమై పోతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం క్రీడల మంత్రిత్వశాఖ ద్వారా కొంత ప్రత్యేక బడ్జెట్ కేటాయించి, మినీ స్టేడియాల మాదిరిగా గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు తయారు చేసి ఆటలు ఆడుకునే అవకాశాలు కల్పించాలని ఆయా గ్రామాల యువత కోరుతున్నారు.



వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్, అధికారులు

ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు

జనగామ రూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు కలెక్టరేట్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ రామాయణాన్ని రచించి ప్రపంచానికి తెలియజేసిన ఆదికవి వాల్మీకి అని అన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారి రవీందర్, ఏవో మన్సూర్, వాల్మీకి బోయ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

- పాలకుర్తి: వాల్మీకి జయంతిని వల్మిడిలో నిర్వహించారు. గ్రామస్తులు భజనలతో ప్రార్థనలు చేస్తూ వాల్మీకి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ తాళ్ల సోమనారాయణ, చంద్రయ్య, మోకాటి కుమార్ పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్‌లో 'బాలయేసు' ప్రతిభ

దేవరుప్పుల, అక్టోబరు 17: మండల కేంద్రంలోని బాలయేసు పాఠశాల విద్యార్థులు సాఫ్ట్‌బాల్ సబ్ జూనియర్‌లో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఈసందర్భంగా జనగామలోని ప్రెస్టన్ గ్రౌండ్‌లో గురువారం సబ్ జూనియర్ బాలికల జట్లు ఎంపిక నిర్వహించగా, బాలయేసు విద్యార్థులు ఇద్దరు జిల్లా స్థాయితోపాటు రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్టు కరస్పాండెంట్ బ్రదర్ జేసురాజ్ తెలిపారు. సాఫ్ట్‌బాల్ రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులు కున్సోత్ స్వాతి, కుష్బూలను ఆయన అభినందించారు. కార్యక్రమంలో పీఈటీ కృష్ణ, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



రాష్ట్ర స్థాయికి పోటీలకు ఎంపికైన స్వాతి, కుష్బూ

మత్స్యకారుల అభివృద్ధే లక్ష్యం: ఎమ్మెల్యే



బయ్యన్న రిజర్వాయర్‌లో చేప పిల్లల్ని వదులుతున్న ఎమ్మెల్యే

కొడకండ్ల అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) : మత్స్యకారుల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డి అన్నారు. బయ్యన్న రిజర్వాయర్‌లో ఆమె గురువారం చేప పిల్లలను వదిలారు. అనంతరం మాట్లాడుతూ అన్ని మండలా ల్లో చేపపిల్లలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. ఇందులో భా గంగానే చేప పిల్లల పంపిణీ చేపట్టినట్టు వెల్లడించారు. అనంతరం మండలకేం ద్రంలోని రాజరాజేశ్వర ఆలయంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రులలో చివరిరోజు పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్నారు.

- మండలకేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే గురువారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ సన్నవడ్లకు రూ.500బోనస్ అందిస్తున్నట్లు తెలిపారు. మండలకేంద్రంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటుకై స్థల పరిశీలన చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. దాంతో అడిషినల్ కలెక్టర్ పింకేష్‌కుమార్, ఎంఆర్వో చంద్రమోహన్‌తో కలిసి మండలకేంద్రబలోని మొగుళ్ళచెరువుగుట్ట వద్ద స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో అధికారులు, కాంగ్రెస్ మండలపార్టీ అధ్యక్షుడు డి.సురేష్ నాయక్ కాంగ్రెస్ ఈజీఎస్ డైరెక్టర్ అందె యాకయ్య, నాయకులు సత్యనారాయణ, రాజేష్, అంజయ్య, భిక్షపతి, రమేశ్, పసునూరి మధుసూదన్, రాజు పాల్గొన్నారు.
- దేవరుప్పుల: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి కోరారు. గురువారం రాంరాజుపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ పీడీ వసంత, పలు శాఖల అధికారులు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నల్ల శ్రీరామ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, జిల్లా విజయడైరీ అధ్యక్షుడు కాసారపు ధర్మారెడ్డి పాల్గొన్నారు.
- దేవరుప్పుల: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షురాలు దాసగాని సుమ ఎమ్మెల్యేకు గురువారం రాంరాజుపల్లి వినతి పత్రం అందజేశారు. రాంరాజుపల్లి కి ఆర్టీసీ బస్సు ఒక్క ట్రిప్పు మాత్రమే రావటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అదనపు ట్రిప్పులు వేయించాలని కోరారు.



టీపీసీసీ అధ్యక్షుడికి పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఇటీవల టీపీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతుల స్వీకరించిన మహేష్‌కుమార్ గౌడ్‌ను స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన పార్టీ మహిళ మండలాధ్యక్షులు గురువారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వడ్లూరి మౌనిక, బ్లాక్ అధ్యక్షురాలు గాజుల రజని, మండలాల అధ్యక్షులు చింత జోత్స్న, యామిని, శోభ, రమ, సుప్రియ, ప్రశాంతి, కొమురమ్మ పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్లకు సై!

(5వ పేజీ తరువాయి)

మద్దతు ధర పొందాలంటే నిబంధనల ప్రకారం తేమ శాతం ఉండేలా చూసుకోవాలని అంటున్నారు. కేంద్రాలకు వచ్చిన తర్వాత తేమ శాతం ఎక్కువ వచ్చి ఇబ్బందులు పడొద్దని, ఇంటి వద్దనే పత్తిని ఆరబెట్టుకొని తీసుకురావాలని సూచిస్తున్నారు.

'ఆధార్' ద్వారా కొనుగోళ్లు

పత్తి కొనుగోళ్లలో ఎలాంటి అక్రమాలు జరగ కూడదన్న ఉద్దేశంతో కొనుగోళ్లలో ఆధార్ కార్డును ప్రామాణికంగా తీసుకోనున్నారు. కొనుగోళ్ల సమయంలో రైతు వేలి ముద్రలను తీసుకొని ఆధార్ కార్డు మ్యాపింగ్ చేయనున్నారు. వేలిముద్రలు సరిగ్గా పడని పక్షంలో ఐరిష్ ద్వారా, ఓటీపీ ద్వారా ఆధార్ మ్యాపింగ్ చేస్తారు. సీసీఐ కొనుగోళ్లలో దళారుల ప్రమేయాన్ని తగ్గించేందుకు గానూ పత్తి అమ్మిన డబ్బులు నేరుగా ఆధార్ కార్డు అనుసంధానం ఉన్న రైతు బ్యాంకు ఖాతాలోనే నేరుగా పడనున్నాయి. ఇందు కోసం బ్యాంకు ఖాతాకు ఆధార్ కార్డు, మొబైల్ నంబర్ అనుసంధానం అయిందా లేదో రైతులు ముందుగానే సరిచూసుకొని కేంద్రాలకు రావాలని అధికారులు సూచిస్తున్నారు.

'వాట్సాప్' చాట్ సేవలు

పత్తి కొనుగోళ్లలో ఎదురుచూపులను తప్పించేందుకు వాట్సాప్ చాట్ విధానాన్ని కొత్తగా తీసుకువచ్చారు. దీని కోసం వ్యవసా య మార్కెటింగ్ శాఖ 88972 81111 వాట్సాప్ నంబర్‌ను తీసుకువచ్చింది.

ఈ నంబర్‌కు రైతులు వా ట్సాప్‌లో 'హాయ్' అని టైప్ చేస్తే అందుబాటులో ఉన్న కొనుగోలు కేంద్రాలు, అమ్మకాల స్థితిగతులు, పత్తి అర్హత, తక్‌పట్టి వివరాలు, చెల్లింపుల స్థితి, సెంటర్‌లలో వేచి ఉండాల్సిన సమయం వంటి వివరాలను లభిస్తాయి.

సీసీఐ కేంద్రాలు ఇవే..

జనగామ మార్కెట్ పరిధిలో సిరికాటన్ జిన్నింగ్ ఇండస్ట్రీస్ (రఘునా థప ల్లి), వెంకటేశ్వర ఇండస్ట్రీస్ (రఘునాథపల్లి), సత్యసాయి కాటన్ ఇండస్ట్రీస్ (నెల్లుట్ల), శ్రీరామలింగ కాటన్ ఇండస్ట్రీస్ (నెల్లుట్ల), హరిహ ర కాటన్ జిన్నింగ్ మిల్ (ఓబులకేశ వాపూర్), స్టేషన్ ఘన్‌పూర్ మార్కెట్ పరిధిలో శ్రీ శివసా యి కాటన్ ఇండస్ట్రీస్(శివునిపల్లి), సిరి కాటన్ ఇండస్ట్రీ స్(రాజవరం), కొడకండ్ల మార్కెట్ పరిధిలో వెంకట సాయి జిన్నింగ్ మిల్(నేలపోగుల), వినాయక కాట న్ ఇండస్ట్రీస్(బంజర), లక్ష్మీశ్రీనివాస కాటన్ ఇండస్ట్రీస్ (బంజర).

జనగామ జడ్పీ సీఈవోగా మాధురి షా

జనగామ రూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) జనగామ జడ్పీ సీఈవోగా మాధురి చషా గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషాను మర్యాదపూర్వకంగా కలిశారు. గుజరాత్ సెక్రటేరియేట్ సర్వీస్ 2018 బ్యాచ్‌కు చెందిన మాధురి షా తెలంగాణ రాష్ట్రానికి డిప్యూటేషన్‌పై రావడం జరిగింది.

- రఘునాథపల్లి: జనగామ జడ్పీ రెగ్యులర్ సీఈవోగా బాధ్యతలు స్వీకరించిన మాధురి షాను డిప్యూటీ సీఈవో సరితతోపాటు పలువురు ఎంపీడీవోలు గురువారం జడ్పీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి బొకే అందించారు. కార్యక్రమంలో ఎంపీడీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు జి.జలంధర్ రెడ్డి, రఘునాథపల్లి ఎంపీడీవో గార్లపాటి శ్రీనివాసులు, బచ్చన్నపేట, నర్మెట, పాలకుర్తి, స్టేషన్‌ఘన్‌పూర్ ఎంపీడీవోలు మల్లిఖార్జున, అరవింద్, రాములు, విజయశ్రీ పాల్గొన్నారు.



కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన మాధురి షా

జఫర్‌గడ్ ఏవోగా కరుణాకర్‌రెడ్డి



జఫర్‌గడ్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): జఫర్‌గడ్ మండల వ్యవసాయాధికారిగా కరుణాకర్‌రెడ్డి నియమితులయ్యారు. ఇప్పటి వరకు మండలానికి స్టేషన్‌ఘన్‌పూర్ వ్యవసాయాధికారి ఇన్‌చార్జిగా వ్యవహరించారు. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన ఏవో పోస్టుల ఖాళీల భర్తీ ప్రక్రియలో భాగంగా కరుణాకర్‌రెడ్డి జఫర్‌గడ్ ఏవోగా గురువారం వ్యవసాయ కార్యాలయంలో బాధ్య తలు చేపట్టారు. ఆయనకు ఎరువులు, ఫర్టిలైజర్స్ షాపుల యజమానులు అభినందనలు తెలిపారు.

రికార్డు అసిస్టెంట్ల సమస్యలను పరిష్కరించాలి

జనగామ రూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) రికార్డు అసిస్టెంట్ల సమస్యలను పరిష్కరించాలని రికార్డు అసిస్టెంట్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జయరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జనగామలో గురువారం ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో జయరాజు మాట్లాడుతూ ఇంటర్ విద్యార్హతతో గ్రామాల్లో మా రికార్డు అసిస్టెంట్లందరికీ జేఆర్‌వోగా అవకాశం కల్పించాలన్నారు. మా రికార్డులో పని చేస్తున్న అసిస్టెంట్లను మాతల్లీ డిపార్‌మెంట్ రెవెన్యూలోకి తీసుకురావాలని, జోనల్ బదులుగా దూర ప్రాంతాలలో విధులు నిర్వహిస్తున్న అసిస్టెంట్లను సొంత జిల్లాలకు బదిలీ చేయాలని కోరారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా పాలెపు శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జక్కుల వెంకటయ్య, నర్సింగ బాలకృష్ణ, కార్యదర్శి జె. సత్యనారాయణ, సహాయ కార్యదర్శి రామకృష్ణ, కోశాధికారి ఎండీ అజీముద్దీన్, సహాయ కోశాధికారి శ్రీధర్, ఆర్గనైజర్ సెక్రటరీ కవిత, కమిటీ నంబరు శ్రీనివాస్ ఎన్నికయ్యారు.

శ్రీహరిని విమర్శించే స్థాయి రాజయ్యకు లేదు'

రఘునాథపల్లి, అక్టోబరు 17:స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని విమర్శించే స్థాయి మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యకు లేదని జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాపోలు రామ్మూర్తి అన్నారు. కంచనపల్లిలో గురువారం జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ పని తీరు, ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై విమర్శించే స్థాయి తాటికొండ రాజయ్యకు ఏమాత్రం లేదని ఘాటుగా విమర్శించారు. పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన రాజయ్య తెలంగాణ ఉద్యమం అడ్డుపెట్టుకుని టీఆర్‌ఎస్‌లో చేరిన విషయం మరచిపోయి ఇప్పుడు నీతులు చెప్పడం ఆయన దివాళకోరుతనానికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఓరుగంటి మనోహర్, తుమ్మ విజయమేరీ, జోజిరెడ్డి, రాపోలు పృథ్వీ పాల్గొన్నారు.

వెంకన్న సన్నిధిలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్



వెంకన్నను దర్శించుకున్న మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్

చిలుపూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : చిలుపూర్ గుట్ట బుగులు వేంకటేశ్వర స్వామిని స్టేషన్‌ఘన్‌పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ జూలుకుంట్ల లావణ్యశిరీష్‌రెడ్డి దర్శించుకున్నారు. గురువారం మార్కెట్ డైరెక్టర్లతోపాటు, కాంగ్రెస్ నాయకులతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. ఆమె మాట్లాడుతూ రైతు సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డైరెక్టర్లు మాదిరెడ్డి యశ్వంత్‌రెడ్డి, పేరాల సుధాకర్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గడ్డమీది సురేశ్, శ్రీహరి సీడ్స్ ఎండి ద్రాక్షపల్లి వరప్రసాద్, ఘట్ట రాజు, రాజకొమురయ్య, కిమానీ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

చిలుపూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నష్కల్ సమీపంలోని ఆకేరువాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ గురువారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. చిన్నపెండ్యాల గ్రామానికి చెందిన ఇల్లందుల అయిలయ్య తన ట్రాక్టర్ ద్వారా ఆకేరువాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడులు చేశామన్నారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసి, నిందితుడు ఐలయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

'పాగాల' విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న సంపత్‌రెడ్డి కుమార్తె సంజనారెడ్డి, నాయకులు

చిలుపూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : దివంగత జడ్పీ ఛైర్మన్ పాగాల సంపత్ రెడ్డి సేవలు మరువలేనివని బీఆర్‌ఎస్ నాయకుడు జనగామ యాదగిరి అన్నారు. గురువారం సంపత్‌రెడ్డి స్వగ్రామం రాజవరంలో ఆయన కాంస్య విగ్రహ ఏర్పాటుకు సంపత్‌రెడ్డి కుమార్తె పాగాల సంజనారెడ్డి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో పాగాల జయపాల్‌రెడ్డి, పాగాల వెంకట్‌రెడ్డి, బత్తుల సూర్యనారాయణ, బీఆర్‌ఎస్ గ్రామాధ్యక్షుడు ఎమ్డీ యాకూబ్ పాషా, నాయకులు ఎడ్ల శ్రీను, రంగు రవిగౌడ్, ఎడ్ల ప్రశాంత్, ఎమ్డీ అసద్ పాల్గొన్నారు.



యాకస్వామిని ఓదార్చుతున్న మాజీ మంత్రి దయాకర్‌రావు

బాధిత కుటుంబానికి ఎర్రబెల్లి పరామర్శ

దేవరుప్పుల, అక్టోబరు 17: కోలుకొండకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు బోనగిరి యాకస్వామి తండ్రి చెంద్రయ్య(70) అనారోగ్యంతో గురువారం మృతి చెందగా మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మృతదేహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు పల్లా సుందర్‌రామ్‌రెడ్డి, మండల బీఆర్‌ఎస్ మాజీ అధ్యక్షుడు బస్వ మల్లేశం, నాయకులు చింత రవి, కోతి ప్రవీణ్, కూతాటి నర్సింహులు, ఏల సుందర్, కొల్లూరు సోమయ్య, మాచర్ల బాబు, గొడుగు మల్లి కార్జున్, వంగ అర్జున్, కాడబోయిన యాదగిరి, అలకుంట్ల యాదగిరి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా శ్రీపాల్‌రెడ్డిని గెలిపించాలి

జఫర్‌గడ్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) : వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీగా శ్రీపాల్‌రెడ్డిని గెలిపించాలని పీఆర్‌టీయూ మండల కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.సీతారామయ్య, యు.రామారావు కోరారు. శ్రీపాల్‌రెడ్డికి మద్దతుగా ఆ సంఘం జిల్లా, మండల ప్రతినిధులు గురువారం కూనూరు, ఉప్పుగల్లు, జఫర్‌గడ్, తిమ్మంపేట జడ్పీ హైస్కూళ్లతోపాటు మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల, కస్తూర్బా బాలికల విద్యాలయాల ఉపాధ్యాయులను కలిసి ఓటు కోసం అభ్యర్థించారు. సమావేశంలో పీఆర్‌టీయు అసోసియేట్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుధాకర్ పాల్గొన్నారు.



ఉప్పుగల్లులో ఓటరు నమోదు పత్రాలను అందిస్తున్న ప్రతినిధులు